సాక్షి
మంచిర్యాల
శుక్రవారం : 26 : మే : 2023



ప్రథమ చికిత్సలో పైలెట్
జిల్లాలో 108 పైలెట్‌లు ఆపదలో ఉన్నవారికి అత్యవసర వైద్యసేవలు అందిస్తున్నారు. సకాలంలో ఆస్పత్రులకు చేర్చి వైద్యం అందడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 8లో ▸



విప్‌ను కలిసిన జేపీఎస్‌లు
కోటపల్లి: మండలంలోని జేపీఎస్‌లు గురువారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను కలిశారు. సర్వీస్ రెగ్యులర్‌కు సీఎం నిర్ణయంపై కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

గరిష్టం/కనిష్టం
41.0 /29.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పడమర దిశగా వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎం సమావేశంలో కలెక్టర్



హైదరాబాద్‌లోని నూతన సచివాలయంలో సీఎం కేసీఆర్ గురువారం కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొన్నారు.

బీట్ అధికారి సస్పెన్షన్
జన్నారం: విధుల్లో నిర్లక్ష్యం కారణంగా ఓ బీట్ అధికారిని ఉన్నత అధికారులు సస్పెండ్ చేశారు. జన్నారం అటవీ డివిజన్ జన్నారం రేంజ్ దేవునిగూడ బీట్ అధికారి అనిల్‌ను సస్పెండ్ చేస్తూ డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు.

ఎంసెట్ ఫలితాల్లో సీఓఈ విద్యార్థుల ప్రతిభ
బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) బాలుర కళాశాల విద్యార్థులు ఎంసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. గురువారం వెలువడిన ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఎంపీసీ విభాగంలో 30 మంది పరీక్ష రాయగా 29మంది అర్హత సాధించారు. మిగిలిన ఒక్క విద్యార్థి ఎయిర్ క్రాఫ్ట్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏఎం ఈసెట్-2023)లో ఉత్తమ ర్యాంకు సాధించాడు. ఎస్.వినయ్ 11,058 ర్యాంకుతో కళాశాల టాపర్‌గా నిలిచాడు. బైపీసీ విభాగంలో 29 మంది పరీక్షకు హాజరు కాగా అందరూ అర్హత సాధించారు. బొట్ల రాము 10,634 ర్యాంకుతో కళాశాల టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. ఒకేసారి ఇంతమంది విద్యార్థులు అర్హత సాధించడం గురుకుల చరిత్రలో ప్రథమంగా పేర్కొనవచ్చు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సైదులు, అధ్యాపకులు శ్రీరామ వర్మ, మిట్ట రమేష్, చందా లక్ష్మీనారాయణ, కట్ల రవీందర్, రాజేందర్ అభినందించారు.

"దుర్గం'ను పార్టీలోకి ఆహ్వానించిన ఆర్‌ఎస్ ప్రవీణ్'



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అశోక్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తమ పార్టీలోకి రావాల్సిందిగా నేతకాని సంఘం నేత, చెన్నూరు నియోజకవర్గ నాయకుడు దుర్గం అశోక్‌ను బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కోరారు. గురువారం మంచిర్యాల పట్టణంలో అశోక్ ఇంటికి నాయకులతో కలసి వెళ్లి తమ పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానించారు. దీనిపై అశోక్ స్పందిస్తూ తనకు కొంత వ్యవధి కావాలని సమాధానం ఇచ్చారు. అశోక్ చెన్నూరు నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పలు కార్యక్రమాలు చేస్తున్నారు.

28న క్రికెట్ జట్ల ఎంపిక
మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న అండర్-19, అండర్-23 క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ కోదాటి ప్రదీప్, కోచ్ పోరండ్ల ప్రదీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటలకు జెడ్పీ గ్రౌండ్‌లోని క్రికెట్ నెట్స్‌కు క్రికెట్ మెటీరియల్, వైట్ యూనిఫాం, బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్సు కాపీలను వెంట తీసుకుని రావాలని, వివరాలకు 9440010696 నంబరులో సంప్రదించాలని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు
బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. విద్యాబోధనలో నాణ్యత ప్రమాణాలు, విద్యార్థులకు కల్పిస్తున్న ల్యాబరేటరీస్, ఇతర మెరుగైన వసతులు, విద్యార్థులతో చేయిస్తున్న ప్రాక్టికల్స్‌కు గాను నేషనల్ బోర్డు ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపును ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఎన్‌బీఏ నుంచి గుర్తింపు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్‌బీఏ బృంద సభ్యులు గత మార్చి 17 నుంచి 19వరకు కళాశాలను సందర్శించారు. ఇంజినీరింగ్ బ్రాంచ్‌లన్నింటికీ ఎన్‌బీఏ గుర్తింపు ఇవ్వడం గమనార్హం.

కనిపించని పెద్ద నోటు!



- జిల్లాలో రెండు వేల నోటు ప్రభావం తక్కువే
- బడాబాబుల లావాదేవీలకే కొంత ఇబ్బంది
- బ్యాంకుల్లో కాకుండా వేరే మార్గాల్లో మార్పిడి
- బంగారం, వస్తువుల కొనుగోళ్లలో ఖర్చు



మంచిర్యాల ఆంధ్రాబ్యాంకులో గురువారం రెండు వేల నోట్లు డిపాజిట్ చేస్తున్న ఖాతాదారుడు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పెద్ద నోటు రూ.2వేలు ఉపసంహరణ ప్రభావం జిల్లాపై తక్కువగానే ఉంది. రూ.2వేల నోటును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించి.. ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 30వరకు బ్యాంకుల్లో మార్పిడి చేసుకునేందుకు రిజర్వు బ్యాంకు గడువు విధించింది. ఎవరైనా తమ వద్ద ఉన్న రెండు వేల నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవచ్చు. ఒక వ్యక్తి రోజుకు రూ.20వేలు(పది నోట్లు) మార్చుకునే అవకాశం కల్పించారు. జిల్లాలో గత మూడు రోజులుగా బ్యాంకులకు మార్పిడి కోసం జనాలు పెద్దగా రావడం లేదు. జాతీయ బ్యాంకులకే రోజుకు ముగ్గురు నుంచి నలుగురు వస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ఇందులో కొందరు డబ్బులను డిపాజిట్ చేసి వెళ్తున్నారు. ఇక ప్రైవేటు బ్యాంకుల్లో రోజుకు ఒకరిద్దరు కూడా రావడం లేదని తెలుస్తోంది. రోజువారీ బ్యాంకు లావాదేవీల్లోనూ రూ.2వేల నోట్ల సంఖ్య బాగా తక్కువగా ఉందని చెబుతున్నారు. జిల్లాలో రూ.కోట్లలో లావాదేవీలు చేస్తూ ఆదాయ పన్ను తప్పించుకునే బడాబాబులు కొందరు మాత్రమే ఈ నోట్లపై హైరానా పడుతున్నట్లు తెలుస్తోంది. పన్ను ఎగవేతకు రెండు వేల నోట్లు నగదు రూపంలో నిల్వ చేసుకున్న వారు మాత్రమే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకున్నారు. బ్యాంకుల్లో కాకుండా ఇతర మార్గాల్లో డబ్బులు మార్పిడి చేసేకునే ప్రయత్నాలు చేస్తున్నారు. బ్యాంకులో వేస్తే లెక్క చెప్పాల్సి రావడంతోపాటు పన్ను పడే అవకాశం ఉంటుంది. రూ.50వేల కంటే అధికంగా డిపాజిట్ చేస్తే పాన్ కార్డు అడుగుతున్నారు. దీంతో బ్యాంకుల్లో కాకుండా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిన చోట్ల రెండు వేల నోట్లను ఇస్తున్నారు.

బడాబాబుల వద్దే..

జిల్లాలో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో గత కొంతకాలంగా రెండు వేల నోట్లు కనిపించడం లేదు. పెళ్లిళ్లు, శుభాకార్యాలు, ఇతర ఫంక్షన్లు, ఇంటి నిర్మాణాలు, తదితర ఖర్చుల్లో మాత్రమే అడపాదడపా ఈ నోట్లు కనిపిస్తున్నాయి. రోజువారీగా జిల్లాలో జరిగే వ్యాపార, వాణిజ్య లావాదేవీల్లోనూ రూ.500, రూ.200, రూ.100 మాత్రమే అధికంగా చలామణిలో ఉన్నాయి. మొత్తం నగదులో 11శాతం వరకు రెండు వేల నోట్లు ఉన్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. అంటే ఈ లెక్కన రోజువారీగా జరిగే లావాదేవీల్లో ఈ నోట్ల చలామణి తక్కువ. దీంతో రెండు వేల నోటు ప్రభావం సామాన్య ప్రజలపై పడలేదు. 2016లో నోట్ల రద్దుతో పెద్ద ఎత్తున జిల్లాలో జనం ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కేవలం రెండు వేల నోట్లు రద్దు కావడంతో పేద, మధ్య తరగతి రోజువారీ లావాదేవీల్లో ఆ నోటు లేదు. ప్రస్తుతం పెద్ద నోట్ల రూపంలో దాచుకున్న కొందరు మాత్రమే తిరిగి చలామణిలో తెచ్చేందుకు యత్నిస్తున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాల్లో మార్పిడి
రెండు వేల నోట్ల మార్పిడి చేసేందుకు బ్యాంకుల్లో కంటే ప్రత్యామ్నాయంగా బదిలీ చేసుకునేందుకు మార్గాలు వెతుకుతున్నారు. బంగారం, పన్నుల చెల్లింపులు, వైన్స్‌లు, పెట్రోలు, వాహనాల కొనుగోళ్లు, ఇతర లావాదేవీల్లో నగదు బదిలీ చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా రియల్ ఎస్టేట్స్, ప్రైవేటు ఆసుపత్రులు, పెద్ద వ్యాపారులు మాత్రమే రెండు వేలనోట్ల ఎక్కువగా ఉపయోగించే అవకాశం ఉంది. ఈ లెక్కన ఆ నోట్లు ప్రస్తుతం బ్యాంకులకు కాకుండా వేరే రకంగా మళ్లించేలా చేస్తున్నట్లు తెలుస్తోంది. భూముల రిజిస్ట్రేషన్లు, వస్తువుల కొనుగోలు, పెట్రోల్ బంకులు, తదితర చోట్ల నోట్ల మార్పిడి చేస్తున్నారు. దీంతో కొద్ది మంది చేతిలోనే పెద్ద నోట్ల నగదు సంబంధించిన డబ్బులు చేతులు మారుతున్నాయి.

డబుల్ ట్రబుల్స్



- మార్చి 17న డ్రాలో 330మంది లబ్ధిదారుల ఎంపిక
- అనర్హులకు సంబంధించి 85 ఫిర్యాదులు
- రెవెన్యూ, మున్సిపల్ అధికారుల పునఃపరిశీలన
- లబ్ధిదారులకు పట్టాలు అందించడంలో ఆలస్యం

మంచిర్యాలటౌన్: ఇళ్లు లేని పేదవారికి గూడు కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు మార్చి 17న కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు. 650డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించగా, అందులో 360ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వానికి స్థలం ఇచ్చిన 30కుటుంబాలకు గతంలోనే 30ఇళ్లను మంజూరు చేయగా, మిగిలిన 330ఇళ్లు సిద్ధంగా ఉండడంతో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్, సిబ్బంది అర్హుల ఎంపిక జాబితాను చేపట్టారు. ఇళ్ల కోసం 5వేల మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, అర్హులుగా మొదట 2,958మందిని గుర్తించారు. మండల రెవెన్యూ అధికారులతో పాటు, జిల్లాస్థాయి అధికారులు రెండుసార్లు సర్వే చేసి, అర్హులు 1,616మంది ఉన్నట్లుగా గుర్తించి, వారికి టోకెన్లు అందించారు. మార్చి 17న కలెక్టర్ అధ్యక్షతన టోకెన్లు తీసుకున్న వారి సమక్షంలోనే లక్కీ డ్రా పద్ధతిలో 330మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు దక్కని వారు, అదే రోజున వేంపల్లిలోని జాతీయ రహదారిపై అనర్హులకు ఇళ్లు వచ్చాయంటూ ఆందోళన చేపట్టారు. అదే నెల 23న మంచిర్యాల మున్సిపల్ కార్యాలయానికి వంద మందికి పైగా లక్కీడ్రాలో ఎంపిక కాని వారు వచ్చి, లక్కీడ్రాలో ఇళ్లను పొందిన 85మంది అనర్హులతో కూడిన జాబితాను ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. సర్వే చేసిన సమయంలో అప్పటికే ఇళ్లు, స్థలం ఉన్నవారు, కారు ఉండి లబ్ధిదారుల తల్లిదండ్రులకు ఇళ్లు, స్థలం ఉన్న వారికి, ఒకే ఇంట్లో ఇద్దరికి లక్కీడ్రాలో ఇళ్లు పొందారని ఆధారాలతో ఫిర్యాదు చేశారు.

ఉమ్మడిగా సర్వే.. రిపోర్టులో జాప్యం

అనర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు డ్రాలో వచ్చాయని మున్సిపల్, రెవెన్యూ అధికారులకు, కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 85ఫిర్యాదులను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వారి సిబ్బందితో మరోసారి సర్వే చేశారు. లక్కీడ్రా కూపన్లను అర్హులకు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా, కొందరు మున్సిపల్ కౌన్సిలర్లు, అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు చేసిన ఒత్తిడి మేరకు అనర్హులను సైతం లక్కీడ్రా లబ్ధిదారుల జాబితాలోకి తీసుకోవడంతోనే గందరగోళంగా పరిస్థితి మారినట్లు తెలిసింది. ఇళ్లను పొందిన వారి జాబితాను ప్రస్తుతం చేపడుతున్న పునఃపరిశీలనలో అనర్హులను గుర్తిస్తున్నారు. లక్కీడ్రాలో ఇళ్లు రాని వారే అనర్హుల జాబితాను తయారు చేసి, మున్సిపల్ అధికారులకు ఇవ్వగా, 85ఫిర్యాదుల్లో సగం అనర్హులుగా గుర్తించినట్లు సమాచారం. పునఃపరిశీలన పేరుతో అనర్హులైన లబ్ధిదారులకు ఇప్పటికీ డబుల్ బెడ్‌రూం హక్కు పత్రాలను ఇవ్వకుండా రెండు నెలలకు పైగా కాలం వెళ్లదీస్తున్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా సర్వే చేస్తున్నా, అనర్హుల జాబితాను గుర్తించడంలో జాప్యం జరుగుతుండడం గమనార్హం.

మరోసారి పరిశీలిస్తున్నాం



డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఎంపికలో 330మందిని డ్రా పద్ధతిలో ఎంపిక చేశాం. పలువురు ఇచ్చిన ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని మున్సిపల్, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో వేర్వేరుగా పునఃపరిశీలన చేసి, అనర్హులు ఎవరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు వచ్చిందో గుర్తించి, కలెక్టర్‌కు ఆయా వివరాలను అందిస్తాం. పూర్తిస్థాయిలో పరిశీలించి డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించిన వాటిపై ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

'భీమ్ స్ఫూర్తిని కొనసాగిస్తున్న ప్రభుత్వం'

బెల్లంపల్లి: అమరజీవి, గోండు వీరుడు కుమురంభీమ్ స్ఫూర్తిని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం ఆయన తాండూర్ మండలం నర్సాపూర్ గిరిజన గ్రామంలో కుమురంభీమ్ మనవడు సోనేరావుతో కలిసి కుమురంభీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని తెలిపారు. గిరిజనులను గుర్తించిన ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. గిరిజనాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని వివరించారు. అడవిలో జీవనం సాగిస్తున్న గిరిజనులను అభివృద్ధి పర్చడానికి తగినన్ని నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్, తాండూర్ ఎంపీపీ ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సాలిగామ బానయ్య, సర్పంచ్ జంగుబాయి, ఎంపీటీసీ సభ్యురాలు రెబ్బెన యశోద, కో ఆప్షన్ సభ్యుడు రహెమత్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాతరి స్వామి, ఆదివాసీ తుడుందెబ్బ నాయకులు బాపురావు, పలువురు రాజకీయ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య, సోనేరావు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తనిఖీలు

వేమనపల్లి: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల వెంట పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై సుబ్బరావు గురువారం నీల్వాయి, మల్లంపేట అటవీ ప్రాంతం వెంట విస్తృత తనిఖీలు నిర్వహించారు. బాంబు డిస్పోజల్ టీమ్‌తో కలిసి అటవీ ప్రాంతంతోపాటు కల్వర్టులు, అనుమానిత ప్రదేశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అనుమానితులను గుర్తించేందుకే ఈ తనిఖీలు చేశామని తెలిపారు.



అడవిలో తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. గురువారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ కేసీఆర్ కిట్ పోర్టల్‌లో వివరాలన్నీ నమోదు చేయాలని సూచించారు. కంటివెలుగు, ఆరోగ్య మహిళా వైద్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వంద శాతం టీకాల కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అన్నారు. 102 అంబులెన్సుల ద్వారా గర్భిణులను ఆసుపత్రులకు తరలించడం, గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించి, ఎన్‌సీడీ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ పూర్ణిమ, డీపీవో ప్రశాంతి, డెమో బుక్క వెంకటేశ్వర్, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు

ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సాధికారత కల్పించడంతోపాటు విద్యాస్థాయిని మెరుగుపర్చడమే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు చేపట్టింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై స్వల్పకాలిక ఆన్‌లైన్ శిక్షణ ఇస్తోంది. ఈ నెల 22న జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య శిక్షణ తరగతులను ప్రారంభించగా.. 40రోజులపాటు కొనసాగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్‌కు చెందిన 3,500 మంది ఉపాధ్యాయులకు హైదరాబాద్ స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ సంస్థ విల్‌టుకెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ సంస్థ ట్రైనర్ రామేశ్వర్‌గౌడ్ జూమ్ వేదిక ద్వారా తర్ఫీదు ఇస్తున్నారు. ఒకటి నుంచి ఎనిమిది వరకు అమలు చేస్తున్న ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతోంది. వచ్చే ఏడాది నుంచి తొమ్మిదో తరగతి వరకు ఆంగ్ల బోధనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మన ఊరు–మన బడి పథకంలో భాగంగా ఆంగ్ల మాధ్యమానికి అవసరమైన డిజిటల్ తరగతుల సదుపాయాలను సమకూరుస్తోంది. గతంలో ఆంగ్ల మాధ్యమం బోధనపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్‌తో సుశిక్షితులు కావడమే కాకుండా ఆంగ్ల మీడియంలో బోధించడం సులభతరంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగనుంది.

మూడు గ్రూపులుగా విభజించి..

40 రోజులపాటు నిర్వహించే స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ కోసం 18 మండలాలను మూడు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో ఆరు మండలాలను చేర్చి వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. వాటిలో లింకులు పంపి ఉపాధ్యాయులు జాయిన్ అయి శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ప్రతీ రోజు సాయంత్రం 4.30గంటల నుంచి 5.30 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. ఆంగ్లంలో సంభాషించడానికి తర్ఫీదుతోపాటు విద్యార్థులకు మెలకువలు నేర్పించే సులువైన పద్ధతులపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఆన్‌లైన్ శిక్షణలో వెయ్యి మంది వరకు పాల్గొంటున్నారు. మిగతా వారందరూ ఒకటి రెండు రోజుల్లో చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఉపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యాదయ్య తెలిపారు.

నీలగిరి ప్లాంటేషన్ పని ప్రాంతాల్లో రక్షణ చర్యలు



కార్మికులకు సూచనలు చేస్తున్న అక్బర్

జైపూర్: నీలగిరి ప్లాంటేషన్ పని ప్రాంతాల్లో కార్మికులు అన్ని రక్షణ చర్యలు తీసుకోవాలని టీఎస్ఎఫ్‌డీసీ డైరెక్టర్ ఎంజే.అక్బర్ తెలిపారు. మండలంలోని ముదిగుంట నీలగిరి ప్లాంటేషన్‌లో పనులను గురువారం ఆయన పరిశీలించారు. కార్మికులకు రక్షణ చర్యల్లో భాగంగా హెల్మెట్లు, బూట్లు అందజేశారు. నీలగిరి చెట్ల కోత, లారీల్లో కలప నింపే సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్లాంటేషన్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ శ్రీశ్రావణి, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్లు సురేశ్, లక్ష్మణ్, వాచర్ శంకర్ పాల్గొన్నారు.

ఒకే రోజు ఐదు ఫోన్ల అప్పగింత

వేమనపల్లి: ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఒకే రోజు ఐదు చోట్ల పోలీసులు ఫోన్లు అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితులు ఫిర్యాదు చేయగా ఆచూకీ కనుగొని అప్పగించారు. వేమనపల్లికి చెందిన రజినికుమార్ ఈ నెల 7న ఫోన్ పోగొట్టుకోగా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన పోలీసులు ఫోన్ ఎక్కడ ఉందో గుర్తించారు. గురువారం చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ బాధితుడికి సెల్‌ఫోన్ అందజేశారు.

చెన్నూర్: ప్రజలు సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ వాసుదేవరావు అన్నారు. ఇటీవల ఫోన్ పోగొట్టుకున్న యువకుడికి స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం అందజేశారు. చెన్నూర్ పట్టణంలోని బొక్కలగూడెం కాలనీకి చెందిన కందువుల బద్రి సెల్‌ఫోన్ పోయిందని ఇటీవల ఫిర్యాదు చేశాడని తెలిపారు. పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అందజేసినట్లు తెలిపారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని నాగార్జున కాలనీకి చెందిన పార్ల సురేశ్ సెల్‌ఫోన్‌ను ఈ నెల 22న పోగొట్టుకున్నాడు. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫోన్‌ను గుర్తించి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రవికుమార్ సురేశ్‌కు అప్పగించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన మోటూరి భువనేశ్వర్ ఈ నెల 14న ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆచూకీ కనుగొని గురువారం హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ చేతుల మీదుగా అప్పగించారు.

నెన్నెల: మండలంలోని జెండావెంకటాపూర్‌లో నివాసం ఉంటున్న శరణ్‌విజాని అనే కేరళ వాసి ఈ నెల 21న ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్‌తో ట్రాప్ చేసిన ఎస్సై శ్యాం పటేల్ ఫోన్‌ను గుర్తించి గురువారం బాధితుడికి అందజేశారు.



సెల్‌ఫోన్ అందజేస్తున్న రూరల్ సీఐ విద్యాసాగర్

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

కాసిపేట: రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి, త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. గురువారం చెక్‌పోస్టుల తనిఖీల్లో భాగంగా సోమగూడెంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యం కల్పించి మిల్లులకు తరలించాలని తెలిపారు. రైస్‌మిల్లులకు ధాన్యం తరలించేందుకు అవసరం మేరకు లారీలను సమకూర్చాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఏంవీఐ ప్రత్యూష, పోలీస్‌శాఖ, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

క్లుప్తంగా

స్కూటీ దగ్ధం



దగ్ధమవుతున్న స్కూటీ

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని తిమ్మాపూర్‌లో తిరుపతి అనే వ్యక్తికి చెందిన స్కూటీ గురువారం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం హోండా యాక్టీవా స్కూటీలో పెట్రోల్ ట్యాంక్ ఫుల్‌గా పోయించుకుని శుభకార్యానికి బయలుదేరాడు. మార్గమధ్యలో అకస్మాత్తుగా స్కూటీ నుంచి మంటలు చెలరేగడంతో వాహనం వదిలి దూరంగా పారిపోయాడు. స్కూటీ పూర్తిగా దగ్ధమైందని, సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో గురువారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. మృతుని వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం1పై మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, తెలుపు, నలుపు, సన్నని గీతలు గల ఫుల్‌షర్టు, బూడిద కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు 9948481902, 9440700038 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

గోదావరిలో...

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని ఇటిక్యాల గోదావరినదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. గురువారం గోదావరి నదిలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లక్ష్మణ్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుని వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, సమాచారం తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని కైరిగాంలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన ముంజం రాజేశం ఎద్దును రోజు మాదిరిగానే గురువారం ఉదయం మేత కోసం వదిలారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి విద్యుత్‌ను సరఫరా చేసే సర్వీస్ వైరును పక్కనే ఉన్న టవర్‌కు కట్టారు. అయితే సర్వీస్ వైరు ఇన్సులేషన్ ఊడిపోయి ఉండడంతో టవర్‌కు వైర్లు తాకి విద్యుత్ సరఫరా అవుతోంది. అటుగా వెళ్లిన ఎద్దు టవర్‌కు తాకడంతో షాక్ తగిలి మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ప్రథమ చికిత్సలో పైలెట్

ప్రమాదం జరిగిన వెంటనే ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడడంలో 108 వాహనాల పైలెట్లు ప్రథములుగా గుర్తింపు పొందారు. అత్యవసర పరిస్థితులలో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు చేరవేసి మెరుగైన వైద్య సేవలందిస్తూ పైలెట్లు పలువురి ప్రశంసలు పొందుతున్నారు. రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, పాముకాటుతో పాటు క్షణికావేశంలో పురుగుల మందు తాగిన సమయాల్లో సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలాలకు క్షణాల్లో చేరుకుని క్షతగాత్రుల ప్రాణాలు కాపాడడంలో 108 వాహన పైలెట్లు కీలక భూమిక పోషిస్తున్నారు. నేడు జాతీయ పైలెట్ల దినోత్సవం సందర్భంగా కథనం.

– చెన్నూర్



సీపీఆర్ శిక్షణ పొందుతున్న పైలెట్

- ఆపదలో ఉన్నవారికి అత్యవసర సేవలు
- ఆస్పత్రులకు చేర్చడంలో వీరిదే కీలక పాత్ర
- నేడు జాతీయ పైలెట్ల దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో 108 వాహనాలు, పైలెట్ల వివరాలు

జిల్లా	వాహనాలు	పైలెట్లు
ఆదిలాబాద్	18	44
మంచిర్యాల	14	35
కుమురంభీం	12	28
నిర్మల్	08	19

విధుల్లో నిరంతరం అప్రమత్తం

ఎనిమిది గంటల విధుల్లో భాగంగా పైలెట్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ప్రమాద జరిగిన సమాచారం అందిన వెంటనే క్షణాల్లో సంఘటన స్థలానికి చేరుకోవడంతో పాటు క్షతగాత్రులను ఆస్పత్రులకు చేరవేయాల్సిన బాధ్యత పైలెట్లదే. వాహనం అదుపు తప్పనీయకుండా వాహనంలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా పైలెట్లు కృషి చేస్తున్నారు. ప్రతి వాహనంలో ఒక పైలెట్, ఒక ఈఎంటీ చొప్పున ఇద్దరు విధులు నిర్వహిస్తుంటారు. వాహనానికి వచ్చిన ఫోన్ కాల్ ప్రకారం సంఘటన స్థలానికి చేరుకోవడం వీరి కర్తవ్యం.

పైలెట్లకు సీపీఆర్ శిక్షణ

పైలెట్‌గా చేరిన తర్వాత ప్రథమ చికిత్స అందించడంలో శిక్షణ ఇవ్వడం మామూలే. ఇటీవలి కాలంలో గుండెపోటు మరణాలు ఎక్కువగా వస్తున్నాయి. సీపీఆర్ చేసి బాధితుల ప్రాణాలను కాపాడేందుకు వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి, గర్భిణులకు అంబులెన్స్‌లో సుఖప్రసవం అయ్యే సమయంలో ఈఎంటీలకు ఎలా సహాయపడాలో శిక్షణ పొందారు.

తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటే..



గర్భిణులను108 వాహనంలో తీసుకువచ్చే సమయాల్లో ఎక్కువశాతం అంబులెన్స్‌లోనే ప్రసవం అయిన సంఘటనలున్నాయి. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్న సందర్భాల్లో సంతోషం కలుగుతుంది.

– ఖలీల్, పైలెట్, కౌటాల, కుమురంభీం

క్షతగాత్రుల ప్రాణాలే ముఖ్యం



పదహారేళ్లుగా పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్నా. ప్రమాద సమాచారం వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రులకు చేరవేసి ప్రాణాలు కాపాడడమే మా లక్ష్యం. ఎన్నో రకాల రోగులను అంబులెన్స్‌లో ఆస్పత్రులకు చేరవేశా. అంబులెన్స్‌లో విధులు నిర్వహించం సంతోషంగా ఉంది.

ఎం.శ్రీనివాస్, పైలెట్, చెన్నూర్

అప్రమత్తంగా ఉండాలి



108 వాహనంలో పైలెట్‌గా ఏడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నా. డ్యూటీ సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. ఏ సమయంలోనైనా ప్రమాదం జరగవచ్చు. రాత్రి సమయాల్లో మరింత జాగ్రత్తగా ఉంటేనే బాధితులను సకాలంలో సమీప ఆస్పత్రులకు చేరవేయవచ్చు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే అందరి ప్రాణాలకు ముప్పే.– బి.సాయికిరణ్,పైలెట్, జైనథ్

ప్రాణాలతో బయటపడితే...



15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా. కొన్ని రోడ్డు ప్రమాద కేసులు చూస్తే బాధ కలుగుతుంది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు ఆర్తనాదాలు చేస్తుంటారు. పురుగుల మందు తాగి ప్రాణాపాయ స్థితిలో ఉంటారు. ఇలాంటి కేసుల్లో ప్రాణాలతో బయటపడితే సంతోషం కలుగుతుంది.

– తిరుపతి, పైలెట్, నిర్మల్

భూసార పరీక్షలకు అనువైన సమయం



బావురావుపేటలో అవగాహన కల్పిస్తున్న ఏఈవో(ఫైల్)



జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

- రెండేళ్లకోసారి మట్టి నమూనాలు సేకరించాలి
- మోతాదులో ఎరువులు వాడితే అధిక దిగుబడులు

చెన్నూర్‌రూరల్: ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడితే భూసారం దెబ్బతింటుందని, రైతులు తప్పనిసరిగా రెండేళ్లకోసారి భూసార పరీక్షలు చేయిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ జాడి బాపు వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

భూసారం తెలుసుకోవాలి

భూసార పరీక్షలు చేయించడానికి ఇదే అనువైన సమయం. నేల తీరునుబట్టి మట్టి నమూనాలు సేకరించాలి. ఎత్తుపల్లాలు ఉన్న నేలల్లో వేర్వేరుగా నమూనాలు సేకరించాలి. నీరులేని ప్రదేశంలో, చెట్లనీడలో కాకుండా విస్తీర్ణంతో సంబంధం లేకుండా 7 నుంచి 8 చోట్ల చెత్తాచెదారం తీసివేసి వేర్లు లేకుండా 'వి' ఆకారంలో 15 సెంటీమీటర్ల లోతులో ఏటవాలుగా గుంత తీయాలి. అందులోంచి మట్టిని తీసి ఒక పాలిథిన్ సంచి మీద కుప్పగా పోసి నాలుగు భాగాలుగా చేయాలి. రెండు భాగాలను తీసివేస్తూ అరకిలో మట్టి వచ్చే వరకు ఈ నాలుగు భాగాల పద్ధతిని అనుసరించాలి. ఇలా సేకరించిన మట్టి నమూనాను గాలిలో ఆరబెట్టి ఒక కవరులో పోయాలి. దాని మీద రైతు పేరు, ఊరు, మండలం, జిల్లా, అంతకు ముందు వేసిన పంట, ఇక ముందు వేసే పంట వివరాలను రాసి భూసార పరీక్ష కేంద్రానికి పంపించాలి. వచ్చిన నివేదిక ఆధారంగా నేలలో సారం ఎంత ఉందో తెలుస్తుంది. తద్వారా భూసారం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి తగు సలహాలు, సూచనలు తీసుకోవాలి. పంట సాగులో ఎరువులు, పురుగు మందులు తగిన మోతాదులో వాడితే మంచి దిగుబడులు వస్తాయి.

చరిత్రాత్మక ఒప్పందం సాధించాం

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు గని కార్మికులకు 11వ వేజ్‌బోర్డులో మెరుగైన, చరిత్రాత్మక ఒప్పందం సాధించామని బీఎంఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. గురువారం ఆర్కే 5గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో కోల్‌కత్తాలో జరిగిన జేబీసీసీఐ 11వ సమావేశంలో బొగ్గు గని కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా వేతన ఒప్పందం సాధించామన్నారు. కోల్ ఇండియా యాజమాన్యంతో కొట్లాడి 19 శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్ సాధించడంతో పాటు అన్ని అలవెన్స్‌లను ప్రస్తుతం ఉన్న దానికంటే 25 శాతం పెంచి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. అండర్‌గ్రౌండ్ అలవెన్స్ 11.25 శాతం, హెచ్‌ఆర్‌ఏ 2.5 శాతంకు పెంచడం జరిగిందన్నారు. పెరిగిన కొత్త వేతనాలు జూలైలో చెల్లించనున్నట్లు తెలిపారు. ఏరియర్స్ బకాయిలు కూడా త్వరలో ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు మాదాసి రవీందర్, మంచినీళ్ల స్వామి, జీడి ప్రభాకర్, కాదాసి భీమయ్య, మంద కమలాకర్, సురేష్, తిరుపతి, నరేష్ పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

- శవపేటికతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్



రోదిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

జన్నారం(ఖానాపూర్): ఉపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లి అనారోగ్యంతో ఈనెల 17న మృతి చెందిన జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన అంబటి అనంతయ్య (54) మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరుకుంది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. గల్ఫ్ కార్మికులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

గల్ఫ్ కార్మికుల ధర్నా

మృతదేహం వస్తున్న విషయం తెలుసుకున్న గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమన్న, గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ల రవిగౌడ్‌లతో పాటు గల్ఫ్ కార్మికులు శవపేటికతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ కిషన్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతిగౌడ్, జేఏసీ రాష్ట్ర నాయకుడు పరికిపండ్ల స్వదేశ్, నాయకులు మగ్గిడి తిరుపతి, దుమల్ల ఎల్లయ్య, భీంరెడ్డి, మహేశ్, నరేంద్ర, నర్సయ్య, గోపాల్, పోశం, రాయలింగు, తదితరులు పాల్గొన్నారు.


కరాటే పోటీల్లో బాలికల ప్రతిభ



ప్రతిభ చాటిన బాలికలు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని నంబర్-2 ఇంక్లైన్‌బస్తీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కరాటే బెల్టు టెస్ట్ పోటీల్లో పలువురు బాలికలు ప్రతిభ చాటారు. 10 సంవత్సరాల విభాగంలో శ్రీహిత ఆరెంజ్ బెల్ట్, 12 సంవత్సరాల విభాగంలో అడ్డగూరి సంహిత, తెప్పల అవంతిక ఎల్లోబెల్ట్ సాధించినట్లు షిటోర్యూ కరాటే రాష్ట్ర అధ్యక్షుడు విజ్జగిరి రవి ప్రకటించారు.

గ్లైఫోసెట్ స్వాధీనం



పట్టుబడిన గ్లైఫోసెట్

దహెగాం(సిర్పూర్): మండలంలోని రాళ్లగూడలో అమ్మడానికి సిద్ధంగా ఉంచిన గ్లైఫోసెట్ (నిషేధిత గడ్డి మందు) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన వగాడె సంతోష్ ఇంట్లో తనిఖీ చేయగా 30 లీటర్ల గ్లైఫోసెట్ లభించిందన్నారు. దాని విలువ రూ.23 వేలు ఉంటుందన్నారు. గడ్డి మందును స్వాధీనం చేసుకుని సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వందేభారత్ రైలును ఆపాలని లేఖ

మంచిర్యాలటౌన్: సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య త్వరలో ప్రారంభం కానున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ గురువారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సౌత్ సెంట్రల్ జీఎంకు లేఖ రాశారు. మంచిర్యాల అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక ప్రాంతమని, వ్యాపారస్తులు నిత్యం హైదరాబాద్, నాగ్‌పూర్ వెళ్తారని, వారి సౌకర్యార్థం మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని లేఖలో కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు ఘనస్వాగతం



రేవయ్య, అతని తల్లి విస్తారుబాయిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): యూపీఎస్సీ ఫలితాల్లో సివిల్స్ ఆలిండియా 410 ర్యాంకు సాధించిన రెబ్బెన మండలంలోని తుంగెడకు చెందిన డోంగ్రి రేవయ్యకు గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎంపీడీవో కార్యాలయంలో రేవయ్య, అతని తల్లి విస్తారుబాయిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ ర్యాలీలో పాల్గొని రేవయ్యను అభినందించారు. గురుకులాల్లో చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. ఎంతో మంది పేద విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, సర్పంచులు చెన్న సోమశేఖర్, డోంగ్రి పెంటయ్య, మాధవి, శాంత, ఎంపీటీసీలు సంఘం శ్రీనివాస్, సాగరమ్మ, టీఆర్ఎస్ నాయకులు ఆనంద్, రవీందర్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన



ఆందోళన చేస్తున్న అశోక్ యాదవ్, నాయకులు

భీమారం(చెన్నూర్): రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కించపరుస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం హైదరాబాద్‌లో యాదవులతో పాటు కురుమ కులస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఒక మంత్రిపై ఇష్టానుసారంగా మాట్లాడడం బాధాకరమన్నారు. రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో గాంధీభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

కంప్యూటర్ విద్యాబోధన ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని ఆండాళమ్మకాలనీలో గురువారం వయోజన విద్యా విభాగం ఆధ్వర్యంలో జిల్లా సివిల్‌సప్లై అధికారి ప్రేమ్‌కుమార్ కంప్యూటర్ విద్యాబోధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేషనల్ విద్య నేర్చుకోవడం ద్వారా జీవితంలో త్వరగా స్థిరపడుతారన్నారు. జిల్లా వయోజన విద్య అధికారి అజ్మీర పురుషోత్తమ్‌నాయక్ మాట్లాడుతూ కంప్యూటర్ నైపుణ్యాలు నేర్చుకుని ఆధునిక కాలానికి తగినట్లుగా ఆదాయం పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సాగర్ తనమిత్రుల సహకారంతో కంప్యూటర్లు అందజేశారు. వయోజన విద్య కుమురంభీం జిల్లా అధికారి రమేశ్‌రెడ్డి, డీఆర్పీలు వెంకటేశ్వర్లు, అశోక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను విస్మరించే పార్టీలకు గుణపాఠం'

పాతమంచిర్యాల: బీసీలను విస్మరించే పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పదవుల కేటాయింపుల్లో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా కో కన్వీనర్ సంగం లక్ష్మణ్, తాడూరి శంకర్, కంచర్ల కొమురయ్య, కుదురుపాక పోషం పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

పాతమంచిర్యాల: జిల్లాలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన పెట్రోల్ బంకులను నిజామాబాద్ చీఫ్ రీజినల్ మేనేజర్ మందం శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులతో స్నేహపూరితంగా మెలగాలని సూచించారు. పట్టణంలోని పెట్రోల్ బంకులతో పాటు బెల్లంపల్లి, తాండూరు, దేవాపూర్, కోమటిచేను, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్‌లోని పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న సురేశ్

మంచిర్యాలటౌన్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ ఆర్‌కె 6లో సింగరేణి కార్మికులు నిర్మించుకున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని భారత జాగృతి విద్యార్థి విభాగం నాయకుడు తోకల సురేష్ యాదవ్ గురువారం తెలంగాణ రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూస్కూరి రామ్మోహన్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గతంలో సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న కార్మిక, కార్మికేతర కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. కానీ నస్పూరులోని 5వ వార్డు దళిత కాలనీలో దాదాపుగా 800ల ఇళ్లు కనీసం సర్వే కూడా చేయలేదన్నారు. వెంటనే సర్వే జరిపించి న్యాయం చేయాలని కోరారు.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు పారదర్శకంగా కంపెనీ క్వార్టర్లు కేటాయిస్తున్నామని పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు అన్నారు. ఏరియాలోని ఖాళీ క్వార్టర్లకోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో గల పర్సనల్ డిపార్టుమెంట్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లలో సింగరేణి క్వార్టర్లకోసం 35 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, కౌన్సిలింగ్ నిర్వహించి సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్లు కేటాయిస్తున్నామన్నారు. క్వార్టర్ల కోసం ఉద్యోగులు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. సంస్థ కేటాయించిన క్వార్టర్లలో ఉద్యోగులు నివాసం ఉండకుండా అద్దెకిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగరేణి ఖాళీ క్వార్టర్లను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం తిరుపతి, జూనియర్ అసిస్టెంట్ తిరుమల పాల్గొన్నారు.